# ఇహపరాల మధ్య



అంధక దేశాన్ని బంధక మహారాజు పరిపాలించే కాలంలో క్రమం తప్పకుండా మూడో యేడు కూడా భయంకరమైన కరువు వచ్చింది. 'నెలకు మూడు వానలు' అనే నానుడి అబద్ధమై పోయింది. ఆషాఢమాసంలో రాలిన నాలుగు చినుకులు తప్ప రాజ్యం మీదకి మబ్బులు తొంగి చూడలేదు. రాగులు, వరిగెలు లాంటి మెట్ట పంటలు గూడా దక్కలేదు. ప్రజలు తిండి దొరక్క చివరికి ఆకులు, అలాలు మేయటం మొదలుబెట్టారు. ఆకలి చావులు మెండయ్యాయి. పాడి పశువులన్నీ నీళ్లు, మేత లేక ఈసుకు పోయాయి. ఆస్థానకవి వామనభట్టు గంటానికి పని తగిలింది.

'వచ్చింది వచ్చింది తప్పుడు కరువు
వచ్చి ఎవరిస్తారిప్పుడు కాణీ అరువు'

- అంటూ తక్షణమే తన వంతు కర్తవ్యంగా చక్కని విషాదకవిత రచించాడు. ('కాణీ' అన్నచోట 'చిల్లికాణీ' అంటే యింకా కరుణరసపూరితంగా ఉంటుందని తర్వాత తోచింది.)

అంత తీవ్ర పరిస్థితిలోను మహామంత్రి తంత్రానందుడు చలించలేదు. ప్రకృతి వైపరీత్యాలు సహజమే అన్నాడు. 'కరువులు కరువులే - పన్నులు పన్నులే' అన్న సిద్ధాంతం అవలంబించాడు. ప్రజల గోళ్లూడగొట్టి అయినా పన్నులు వసూలు చెయ్యండి అని ఆదేశించాడు. పన్నులు కట్టలేని ఆపన్నులు పొరుగుదేశాలకి వలస వెళ్లసాగారు. ప్రజల ఆక్రందనలు చివరికి కోటగోడలు దాటి, అంతఃపురం దాకా మారు మోగాయి. మహారాజు కాస్త విచారపడ్డాడు. మంత్రి, ఆంతరంగిక, సేనాధిపతులతో ప్రత్యేక సమావేశం జరిపాడు.

"విధి బలీయం మహారాజా!" అన్నాడు మహామంత్రి గంభీరంగా, ఏ క్లిష్ట సమస్యనైనా విధికప్పగిస్తే తీరిపోతుందని అతనికి తెలుసు.

అతనితో సదవగాహన గల సేనాధిపతి శూరసేనుడు "అవునవును, బలీయం మహారాజా!" అని సమర్థించాడు. కాని కొత్తగా మంత్రివర్గంలో చేరిన కుర్రమంత్రి కుమార వర్మ అడ్డు చెప్పాడు.

"ప్రభూ! అతివృష్టి, అనావృష్టి ప్రకృతి సహజమే. అయితే వాటివల్ల ఎప్పుడైనా కరువు కాటకాలు ఏర్పడతాయనే ముందు యోచన వుండాలి. ముందుగానే తగినంత ధాన్యం నిలవుంచినట్లయితే కొంత ఈ ఉపద్రవం తప్పేది. అంతేగాదు, ఇటువంటి సందర్భాల్లో పన్నుల పోటు తగ్గిస్తే అన్నదాతల ఆత్మహత్యలు కొన్ని అయినా తగ్గుతాయి" అన్నాడు చురుగ్గా.

రాజుగారికి ఏ విషయం తెలియగూడదనుకొన్నాడో అదే విషయం బట్టబయలయ్యే పాటికి మహామంత్రి ముఖం జేవురించింది. "హుం, కుర్రతనం" అన్నాడు హుందాగా, గడ్డం సవరించుకొంటూ.

"అవునవును, కుర్రతనం, హుం" అన్నాడు సేనాధిపతి, సవరించుకోవటానికి గడ్డం లేనందున ఇబ్బంది పడుతూ.

"హౌరా! మా రామరాజ్యంలో హన్నదాతల హాత్మహత్యలా? హవమానం! మహావమానం!!" ఆసనం నుండి పైకిలేస్తూ ఉద్రేకపడ్డాడు బంధక మహారాజు. "మరి యింత జరుగుతుంటే మహా మంత్రుల వారేం జేస్తున్నట్టు?" అడిగాడు కోపంగా.

"చి....చి....చిత్తం" అన్నాడు తంత్రానందుడు కంగారుగా. "పరిస్థితి మరీ తీవ్రంగా లేదు మహారాజా! అయినా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఆత్మహత్య శవాన్ని చూపించినను, లేదా శవం ఆత్మహత్యను చూపించినను సదరు శవబంధువులకు మణుగు కట్టెలు మంజూరు చేస్తున్నాం. అదే ఒక కుటుంబంలో రెండు ఆత్మహత్యలు జరిగినట్టాయెనా శవాలపై కప్పటానికి

ఇతోధికంగా రెండేసి గజాల బహు తెల్లటి మల్లుగుడ్డ కూడా ఇస్తున్నాం ప్రభూ! ఇక శ్మశానాల్లో తొక్కిసలాట జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నాం. పరిస్థితి యింకా విషమిస్తే రైతులకు వారి వారి పొలాల్లోనే... నే...నే..." అని సగంలో ఆగిపోయాడు తంత్రానందుడు కుమార వర్మ అడ్డం పడటంతో.

"అది సమస్యకు పరిష్కారం కాదు మహారాజా! అసలు రైతులు ఆత్మహత్య లెందుకు చేసుకోవాల్సి వచ్చింది?"

"అవును, ఎందుకు వచ్చినది?" అడిగాడు కుతూహలంగా మహారాజు.

"మన అధికారులు 'కరువు కరువులే, పన్నులు పన్నులే' అని ప్రజలను పదే పదే తీవ్రంగా వేధించడం చేత." అని చెప్పాడు కుద్రమంత్రి.

"కాదు, మరియు లేదు" అన్నాడు తంత్రానందుడు గట్టిగా, పెద్ద గొంతుతో.

"అవునవును. కాదును మరియు లేదును" వత్తాసు పలికాడు సేనాధిపతి.

మహారాజు అయోమయంలో పడ్డాడు. "ఇంతకీ ఎంతమంది హన్నదాతలు హాత్మహత్యలు చేసుకున్నారు?"

"వెయ్యిన్నొక్క...." అని చెప్పబోతున్న ఆస్థాన కరణాలను వారించిన వాడై మహామంత్రి "ఆఁ... అదే..., వెయ్యిన్నొక్క విధాలుగా గణించినా మృతుల లెక్క నూటొక్కటి మించలేదు ప్రభూ! అదియునుంగాక రైతన్నలు జీవితవిరక్తిచేగాక, రాజభక్తిచే పరలోకమేగుచున్నారని సమాచారము."

"అదెట్లు?" బంధకుడి భృకుటి ముడిపడింది.

"కష్టకాలములో ఏలినవారికి భారము కాలేక యిష్టపూర్వకముగా, గొప్ప విశ్వాసముతో ఆత్మత్యాగము చేసిరని విశ్వసించుటకు తగిన సాక్ష్యములున్నవని విశ్వసించుచున్నాము" అని విన్నవించాడు వినయంగా తలవంచి.

బంధక మహారాజు మొహం వికసించింది. "ఇది బహులెస్సగా నున్నది. పరలోక గంతులైన రాజభక్తులకు మా శుభాకాంక్షలు. ఇక బసను చాలించి సభకు... కాదు కాదు, సభను చాలించి బసకు పోయెదముగాక" అంటూ సెలవు తీసుకొన్నాడు మహారాజు.

"పరలోకగంతులా? వాళ్లకి శుభాకాంక్షలా?" తెల్లబోయాడు కుద్రమంత్రి కుమారవర్మ.

అయితే మహారాజు మనస్సు ఎందుకనో అంతటితో శాంతించలేదు. మాటి మాటికి సంభవిస్తున్న ఈతిబాధల్ని రూపుమాపే ఉపాయమేదైనా ఆలోచించమని మరునాటి సభలో అడిగాడు. అడగటమే ఆలస్యంగా, కొంత కాలం నుంచి అగ్రహారాదిసత్కారాలు లేక అలమటిస్తున్న ఆస్థాన కవి అందుకొన్నాడు.

"ప్రభువుల వారు చిత్తగించాలి. 'కాదిది కాటకం, విధి ఆడే నాటకం!' ఇదంతా శనిగ్రహ మహిమ. ఏతద్దోష నివారణార్థం - తమ ఆనతి తలదాల్చి - నేను శనైశ్చర మాహాత్మ్యం రచించి, తమకు అంకితం చేసుకొంటాను. ఇకపై అంటాను - 'కాచుకో శనీ! అయిపోయింది నీ పని!' ఆపైన ప్రజలకు శని పీడ విరగడవుతుంది. మహారాజా! అభ్యుదయ పరంపరాభివృద్ధిగా నా యొనర్పంబూనిన ఇమ్మహాగ్రంథంబునకు ప్రారంభం బెట్టిదనిన..." అంటుండగానే ఆస్థాన జ్యోతిష్యుడు వరాహచంద్రుడు అడ్డం పడ్డాడు.

"వామనభట్టుగారు భేషైన కవులే గాని, ఈ విషయంలో నా సందేహం నాది. వారి గ్రంథమహిమ చేత ప్రజలను వదలిపెట్టిన ఈ శనేదో గ్రహపాటున ప్రభువుల వారిని పట్టుకొంటేనో?"

బంధకుడు ఉలిక్కిపడ్డాడు. తన ప్రయత్నానికి అడ్డుపడిన వరాహచంద్రుడిని మింగేసేటట్టు చూశాడు వామనభట్టు. కించిత్ మందహాసంతో వరాహచంద్రుడు మహారాజుగారికి తన ప్రతిపాదన విన్పించాడు.

"మహాప్రభూ! ఇంతకాలంగా ఈతిబాధలు మన రాజ్యాన్ని పట్టి పీడించటం మామూలు విషయంగాదు. ఈ సందర్భంగా, గ్రహతారకల గతులన్నీ గణించి గుణించి, మరియు గుణించి గణించగా, మన రాజ్యంపై దైవానుగ్రహం తప్పినదని తేలినది. కారణం పరిశీలించాను. చంద్రవంశ క్షత్రియులైన తమ తాతలు, ముత్తాతలు భద్రానది కవతలి గట్టున తరిగొండపై వెలసియున్న సోమేశ్వర స్వామిని నిష్ఠతో సేవించేవారు. ఈశ్వరుడు చంద్రశేఖరుడు గదా! కావున తమ చంద్రవంశ పాలన చల్లగా సాగినది. అప్పుడు దేశంలో క్షేమం తప్ప క్షామం లేదు. ధాన్యం తప్ప దైన్యం లేదు. ఎందువల్లనో తమ ఏలుబడి నాటికి ఆ ఆచారం తప్పినది. తత్ఫలితమే యిప్పటి అనర్థమని శాస్త్రం శతవిధాల ఘోషిస్తున్నది. కనుక ఆ దైవానికి యథాపూర్విగా పూజా పురస్కారాలు జరిపించినట్లాయెనా, ఈ అరిష్టాలన్నీ చప్పున హరిస్తాయని నాకు గట్టి నమ్మకం కలిగినది."

రాజుగారి మనస్సు శాంతించింది. అయితే ఇంతలో సభ చివర కూర్చున్న కుమారవర్మ లేచాడు. "రాజా! ఇహలోక సమస్యలకు ఆధిభౌతిక కారణాలేగాని ఆధ్యాత్మిక కారణాలుండవు. వాటిని సరిగ్గా గుర్తించి సమస్యకు పరిష్కార మార్గం ఆలోచించాలి" అని సూచించాడు.

మహారాజుకా మాటలు బోధపడక బిక్కమొహం పెట్టాడు. తంత్రానందుడు అతని చెవి దగ్గర చేరి, "ప్రభూ! ఇతని వాలకం చూడంజూడ నాస్తికుడేమో యనిపించుచున్నది. 'నాస్తికో వేదనిందకః' ఆపై తమ చిత్తము" అన్నాడు. రాజు ఉలిక్కిపడ్డాడు. ఆస్థాన జ్యోతిష్కుని మాటను - ఒకరిద్దరు మౌనం వహించిన సభ్యులు తప్పించి - అంతా ఆమోదించారు. ఈ వ్యవహారానికి నిరసనగా కుమారవర్మ... ఈ వ్యవహారానికి నిరసనగా కుమ్రమంత్రి సభ నుంచి వెళ్లిపోయాడు. అయితే యిప్పుడు

భద్రానది 'శుష్కించి వున్నా రేపు వానాకాలం వస్తే ఉప్పొంగే నది కవతల కొండ మీది కైలాస వాసునికి కైంకర్యం ఎట్లా జరుగుతుందనే మీమాంస కలిగింది.

"అయితే సత్వరం వానలు రాక ముందే నదిపై వారధి కట్టించండి" ఆదేశించాడు బంధక మహారాజు ఉత్సాహంతో.

రాజాజ్ఞ శరవేగంతో అమలయింది. అస్మదీయులైన మహామంత్రి మేనల్లుడు మరియు సేనాధిపతి బావమరుదులకు వంతెన నిర్మాణ బాధ్యత అప్పజెప్పబడింది. అందుకు అక్షరాల లక్షవరహాలు వెచ్చమయ్యాయి. వంతెన పని నాణ్యత గూర్చి అధికారవర్గాల్లో గుస గుసలు సాగాయి.

ఆషాఢమాసంలో వరుణుడు కరుణించాడు. జల్లులు పడటంతో నేలంతా పచ్చగిల్లింది.

"చూశారా మహా ప్రభూ! తమ ఆశీస్సులతో మన చిరంజీవులు వంతెన పని ముగించారో లేదో దైవం కరుణించాడు. ఇక తమరు పూజా పురస్కారాలు ప్రారంభిస్తే... దైవకృప 'వరదలై పారటం' తథ్యం" అన్నాడు తంత్రానందుడు.

"అవునవును. మాదీ అదేమాట" బలపరిచాడు సేనాధిపతి,

"లెస్సగా పలికితిరి మహామంత్రీ!" అన్నాడు రాజు ఉబ్బితబ్బిబ్బు అవుతూ.

శ్రావణమాసంలో వానలు దండిగా పడ్డాయి. ఎక్కడెక్కడ వలసపోయిన కాపులంతా కన్న ఊరు చేరుకొన్నారు. నేల పదునైంది. అరకలు సాగాయి. వెదలుపడ్డాయి. పైర్లు పచ్చగా మొలిచాయి. ఆస్థాన జ్యోతిష్కుడు అన్నీ గుణించి, తరిగొండ మీద సోమేశ్వర స్వామికి నూతన పూజాప్రారంభానికి శుభముహూర్తం పెట్టాడు. శ్రావణ శుద్ధ ఏకాదశి మూలానక్షత్రంలో బ్రాహ్మీముహూర్తంలో యజ్ఞపురస్సరంగా దైవపూజ ప్రారంభిస్తే ప్రజలు సుఖ సౌభాగ్యాలలో ఓలలాడతారు.

భద్రానది పోటెత్తి పారుతోంది. కుబ్రమంత్రి మనస్సెందుకో కీడు శంకించింది. ఆనాటి రాత్రి దేశం దేశమంతా ఉత్సాహంతో ఉరకలేసింది. సేవకులు ముందు దివిటీలు పట్టి నడుస్తుండగా, మహారాజు పట్టపుటేనుగు మీద తరిగొండకు బయల్దేరాడు. ఆపై రాణివాసం, చిన్నారి యువరాజు, మంత్రి సేనాపతులు రథాలపై అనుసరించారు. ప్రముఖులంతా వారధి దాటారు.

చుక్కల వెలుగులో వంతెన కింద భద్రానది ఉరకలెత్తుతోంది. ఎగువనెక్కడో కురిసిన కుంభవృష్టికి క్షణక్షణం నీటిమట్టం పెరుగుతోంది. పూజా కార్యక్రమానికి బయల్దేరిన రెండవ దళంలో ఆస్థాన జ్యోతిష్కుడు వరాహచంద్రుడు, ప్రధాన పురోహితులు, భజన కోలాటాలలో మైమరచిపోయిన అశేష భక్తబృందం ఉన్నారు. అంతా వంతెన మీద ప్రయాణిస్తుండగా

ఒక్కసారిగా భద్రానది ఉప్పొంగింది. అంతలావు వారధి అగ్గిపెట్టెలాగా వరదతాకిడికి కొట్టుకుపోయింది. ఏం జరిగిందో గ్రహించేలోపుగానే నూట పదిహేను మంది భక్తులు నీటిపాలయ్యారు. బొటనవేలుతో చిటికెన వేలును గణిస్తున్న భంగిమలో ఆస్థాన జ్యోతిష్కుని కళేబరం మైలు దూరంలో తేలింది. తెల్లగా తెల్లారిన తర్వాతగాని రాజుగారికి, అధికారగణానికి దుర్వార్త అందలేదు. మహారాజు ఖిన్నుడయ్యాడు.

దేశమంతటా హాహాకారాలు చెలరేగాయి. ఒక్కవానకే బ్రహ్మాండమైన వంతెన అయిపు, అజ లేకుండా కొట్టుకుపోయిందంటే అది కచ్చితంగా నాసిరకం నిర్మాణమేనని, ఈ అవినీతి భాగోతాన్ని ప్రభుత్వం వెంటనే విచారించాలని బాధిత కుటుంబాల వారు, మేధావులు ఆందోళన చేశారు. మహారాజు తక్షణమే స్పందించాడు. ఒక విచారణ సంఘాన్ని నియమించి, దోషుల్ని శిక్షించాల్సిందిగా మహామంత్రిని ఆదేశించాడు.

ఆ రాత్రికి తంత్రానందుడు, శూరసేనుడు చాటుగా సమావేశమయ్యారు. వంతెన నిర్మాణంలో చిరంజీవుల అవినీతి బయటపడితే ప్రమాదం. గండం గట్టెక్కటానికి జాముసేపు మల్లగుల్లాలు పడ్డారు. మరునాడు 'నదీ ప్రమాద విచారణ సంఘం' ఏర్పడింది. అందులోని ముగ్గురు సభ్యుల్లో ఇద్దరు అస్మదీయులుండేట్టు చూశాడు తంత్రానందుడు.

మరోవైపు కుర్రమంత్రి కుమార వర్మ నలుగురు మిత్రుల్తో కలిసి ప్రమాదస్థలానికి వెళ్లి పరిశీలించాడు. వంతెన శిథిలాల్ని సేకరించాడు. ప్రజాభిప్రాయం తెలుసుకున్నాడు. తర్వాత స్వయంగా మహారాజును కలిశాడు. వంతెన నిర్మాణంలో ఇసుక తప్ప సున్నం వాడలేదని, లక్షవరహాలు ఖర్చుచేసిన ఆ నిర్మాణం నిజానికి పాతికవేలకు మించి విలువ చెయ్యదని, కనుక నాసిరకం నిర్మాణం చేసి, ప్రమాదానికి కారకులైన మంత్రి, సేనాధిపతుల బంధువుల్ని కఠినంగా శిక్షించాలని, నీటి పాలైన కుటుంబాల వారిని ఆదుకోవాలని విన్నవించాడు.

"విచారణ సంఘ నివేదిక కూడా రానివ్వండి, చూద్దాం" అన్నాడు మహారాజు గంభీరంగా.

సోమేశ్వరస్వామి ఆలయం వద్ద మరో శుభదినాన 'నదీ ప్రమాద విచారణ' ప్రారంభమైంది. వంతెన లేకపోవటం వల్ల సామాన్యులెవరూ నీటి ఉరవడిలో ఈదుకుంటూ వచ్చి సాక్ష్యం చెప్పలేకపోయారు. అది ముందుగా ఊహించే తంత్రానందుడు ఆ ఏర్పాటు చేశాడు. విచారణ మహామంత్రితోనే మొదలైంది.

"మంత్రాంగ పరులైన ఓ మహామంత్రీ! వంతెన కూలిన వైనమేమండీ?"

అని అధికారి అడగగానే తంత్రానందుడు తడుముకోకుండా "నేనెరుగ నేనెరుగ సేనాధిపతినడుగు" అన్నాడు.

"అరివీర మార్తాండ ఓ శూరసేనా! వంతెన కూలిన వైనమేమండీ?"

"నేనెరుగ నేనెరుగ నా మరిది నడుగు."

"వంతెన కట్టిన ఓ మరిదిగారూ! వంతెన కూలిన వైనమేమీ?"

"నేనెరుగ నేనెరుగ గంగమ్మ నడుగు."

"గలగలా పారేటి గంగమ్మ తల్లీ! వంతెన కూలిన వైనమేమమ్మా?"

"నేనెరుగ నేనెరుగ తరిగొండ నడుగు."

"కొండల పెనుగొండ ఓ తరిగొండా! వంతెన కూలిన వైనమేమీ?"

"నేనెరుగ నేనెరుగ నా మీద శివునడుగు."

"దేవాదిదేవుడా! ఓ పరమేశుడా! వంతెన కూలిన వైనమేమయ్యా?" అని ముక్త కంఠంతో ప్రార్థించారు విచారణాధికారులు.

"వారిని వీరినిప్రశ్నించనేలరా? కట్టినా కూల్చినా కర్త నేనే గదా?" అని అశరీరవాణి వాక్కు 'వారికి మాత్రమే' విన్పించింది.

ఈ విధంగా సాక్షాత్తు 'పరమేశ్వర సాక్ష్యంతో' విచారణ నిర్విఘ్న పరిసమాప్తి చెందింది. అధికారులు మల్లగుల్లాలు పడి, అరవై పుటల నివేదిక మహామంత్రి 'చేతుల మీదగా' మహారాజుకు సమర్పించారు. నిండుసభలో ప్రధాన విచారణాధికారి నివేదిక మొత్తం చదివి విన్పించాడు.

"....ఏవంవిధ సాక్ష్యాధారములన్నియు సావధానముగా పరిశీలించిన పిమ్మట తేలిన సారాంశమేమనగా - ఏతత్ వారధి నిర్మాణమునందు అధికారులు, నిర్మాణకారుల అవినీతి లేదా అలసత్వము లేశమైనను లేదు. ఇది దైవ చిద్విలాసమే గాని మానవ దోషము గాదు. (చూడుము: సాక్ష్యము - 6, పత్ర సంఖ్య - 16) ఆ కైలాసవాసునకు గడచిన శ్రావణమాస శుక్రవారమునాడు సాక్షాత్తు తన లోకమునందే భక్తులచే పూజలు స్వీకరింప తలంపు గలిగినది. తత్ఫలితమే ఈ మహత్తర ఘటన. ఆ యొక్క మహాభక్తులు ఈ కారణముగా గంగామాత ద్వారా కైలాసగతులైనందున మోదము తప్ప ఖేదమునకు తావులేదు. వారి రాజభక్తి మరియు దైవభక్తి అభినందనీయములు."

బంధక మహారాజు ఆనంద పరవశుడయ్యాడు. "ఇది కడుంగడు లెస్సగా నున్నది. దివగంతులైన మహాభక్తులకు మా శుభాభినందనలు" అని అభిభాషించాడు. ('దివంగతులైన' అని అపవారిస్తూ సవరించాడు తంత్రానందుడు. 'కాదు, దివగంతులే అని మా అభిప్రాయము' అన్నాడు మహారాజు. 'కానిండు, మీ అభిప్రాయమే మా అభిప్రాయము' అన్నాడు మహామంత్రి.)

సభ్యులంతా కరతాళధ్వనులతో 'నదీ ప్రమాద నివేదిక'కు తమ ఆమోదం తెల్పారు.

ఆ మరునాడే 'అవిధేయుడైన' కుర్రమంత్రి కుమారవర్మ పదవి ఊడిపోయింది!

❖